# నిశానీలు

నెలాఖరు రోజులు. ఆదివారం జేబులో ఏం చెప్పుకో దగ్గ డబ్బులేదు ఒక చెల్లనిపావలా, రెండుఅణాలు, నాలుగు కన్నం కానులు. రోజంతా మనుష్యులను వేపుకొని తింటున్న ఎండల్లో కాకులకన్నా నల్లగా మాడిమాడి తిరిగి తిరిగి ఇల్లు చేరుకొన్నాను ఎక్కడా డబ్బుపుట్టలేదు.. రెండు మూడు రోజులు పోతేనేగాని జీతం అందదు. విసిగిపోయి గదికొచ్చి టిక్కెట్లు తీసుకొని హోటలుకి వెళ్ళేసరికి మూసేసివుంది. నిరుత్సాహంతో తిరిగివచ్చాను. ఆలోచించుకుంటూ నడుస్తూ గదినిదాటి చాలాదూరం వెళ్ళిపోయేను. కాళ్ళు వాటి మానాన అవి నడుస్తున్నాయి తెగ ఆలోచిస్తున్నాను. రేపు ఆఫీసులో అతణ్ణి అడుగుతాను. ఇచ్చేడా సరేసరి. లేదా ఏం చెయ్యాను. అబ్బే, జీతం అందుకోగానే ఇచ్చేనూ! అని అంటాను. ఇస్తాడు పాపం! ఆవిడ చాలామంచిది. ఇవాళ కాఫీ ఇచ్చింది ఆయన యింట్లో లేకపోయినా. యింతో అంతో చదువుకుంది కదూ... ఛా ఏమిటో వెధవమనస్సు...

చాలు దారుల్లోకి వచ్చేసరికి ఆలోచనలు వాటితో పాటు నడకా ఆగిపోయి అరే గదిదాటిపోయేమే అనుకొని వెనుకతిరిగి గది చేరుకున్నా. వీథిచివర మిఠాయికొట్టు తెరచి వుంది. అయినా జేబులో ఏం డబ్బులేదు. రేపొద్దున్న కాఫీకి చాలీ చాలని ఆస్తి. అర్ధరాత్రి చంద్రోదయమైంది. చంద్రకాంతి దొంగలా మేడలమీద కెగబాకుతున్నది. నిద్దర పట్టలేదు. కడుపులో పేగు లరుస్తున్నాయి. పిట్టగోడదగ్గిరి

కొచ్చి మేడమీంచి నగరంవంక చూశాను. గాలేనా కదల లేదు. ప్రశాంతంగా నగరం నిద్రపోతున్నది. ఎదుటివేడ మెడలో రక్షరేకులా సైనుబోర్డు వేలాడుతున్నది. వాళ్ళపడ గ్గదిలో దీపం కునకడం ఒకవ్యక్తి వెచ్చగా శ్వాసించడం చూసేనో వూహించుకొన్నానో...తల విరగబోసుకొన్న చెట్లకి యిరులే కురులు...దృశ్యాన్ని చూడలేక వచ్చి పడు కున్నా.

చలికి చీకటి ఘనీభవించి పొగతెరలాగ నాచుట్టూ ఆవరించింది. పడుక్కొన్ననాకు నాబుర్ర ఒక్కటేతప్ప మరే యితర ప్రపంచం వున్నట్టే తోచలేదు, చివరకి తతిమ్మా నా శరీరంసైతం. ఇంతలోకే సన్నని గొంతుకలు మాట్లాడు కోడం వినిపి చింది. గది మెల్లిగా గొంతు సవరించుకొని జోళ్ళని అడిగింది. ఏం తమ్ముడూ, యివాళ మూలుగు తున్నావు. ఏ. చెప్పేది నిన్నుతొడుక్కొని వెళ్లేడా దార్లో నాపటకా వూడొచ్చింది. మా బాధగాఉంది అన్నాయి జోళ్లు.

అప్పుడు నాకేం సందేహం వెయ్యలేదు. జోళ్ళు రెండుకదా! అందులో ఏదిమాట్లాడినట్లూ అని. బహుశా రెండూ సమిష్టిగా కధనంచేసివుంటాయి. ఆ సమయంలో నాకు కుతూహలం ఆశ్చర్యంతప్ప మరేం లేవు. ఇంతలోనే గది అడిగింది. అయితే యివాళ కధ చెప్పలేవన్నమాట! చెప్పలేకేం. పొద్దుట యిక్కణ్ణుంచి వెళ్ళేం. ఎక్కేట్రాము లెక్కేడు. దిగేట్రాములు దిగేడు. తిరిగినవీధులే తిరిగేడు.

కథా నిలయం 663

మాట్లాడినవాళ్ళతో మాట్లాడేసు. చివరకి ఒంటిగంటకి ఎవరో స్నేహితుడు కలసి భోంచేసేసు. అతగాణ్ణి ఎంచేతో వదిలేసి మళ్ళా ప్రొద్దున్న తిరిగినవీధులే తిరిగేసు. అబ్బ! ఎన్నిరోడ్లు తొక్కేడని. చివరకి ఒకయింటికి చేరుకున్నాడు. గుమ్మం ముందు నన్ను వదిలేసి లోపలికి వెళ్లేడు. లోపల ఏం జరిగిందో నాకు తెలీదు. ఒక అరగంటపోయాక చికాగ్గావచ్చి నన్ను తొడుక్కుని వీధినిపడ్డాడు. ఆఖరికి బీచికేవచ్చిఅక్కడ సైతం యిసుకలో తెగ నడిచేసు. అబ్బా! అసలే నావంట్లో బాగులేదు. ఇసకలోనడక,జోళ్ళు దగ్గుతున్నాయి, ట్రాములో ట్రాములోగంటలా కన్నూకన్నూమంటూ. గది మళ్ళా అడిగింది. గదికంఠం మలుపుతిరిగే ట్రాంకీచు. ఆ, యింకా, అయితే యజమాని యివాళ ఖుషీగా లేడన్నమాట. అదే చూశాను కదూ. అప్పుడప్పుడు యిలాగే ఉంటూఉంటాడు. అదీ నెలకోసారే. జోళ్ళన్నాయి. అవును. కిందటినెలకూడా యిలాగే ఆవేళసంగతి చెప్పానుకదూ? యివాళ చాలా నిరుత్సాహంగా ఉన్నాడు. గది ఆ, మర్చిపోయాను, చూడూ, ఆవేళ రాత్రి ఆయింట్లోకథ వాచీ చెప్తానందికదూ! ఏదీ వాచీ! మాట్లాడకుండా కూర్చున్నావు చెప్పు. వేగంచెప్పు. మళ్ళా ఆలస్యం అయితే యజమాని లేస్తాడు. అతడిది కోడికునుకు. రిస్టువాచీ యిలా చెప్పడంమొదలెట్టింది: గదన్నా, ఏం జరిగిందంటే యివాళలాగే తిరిగేడు. ఎక్కడో నాలుగు రూపాయలు సంపాదించేడు. సాయంత్రం సినిమాకి బయల్దేరేడు. చూడదగ్గ సినిమా ఆట. అంతకు మూడురోజులనుంచీ యత్నపడుతున్నాడు. వాటి తస్సాదియ్యా మంచిసినిమాలు నెలా

ఖరికే వస్తాయిగాబోలు! వెళ్ళి సినిమా చూశాడు. ఏమీ ఆనందించనట్టే ఉంది. సినిమాని హర్షించేందుకు సంపద స్నేహితులు పక్కనుండాలి ఆడస్నేహితులైతే మరీమంచిది. తిరిగి వస్తూవుంటే ఎదురింటిలోకి వెళ్ళేడు. ఆయనా అమ్మాయీ మాట్లాడుకొంటున్నారు. యజమానిని చూస్తూ మాబాగా సినీమాకి తీసుకోని వెళ్ళేరుకదూ! అన్నది ఆపిల్ల. అందుకే క్షమాపణ చెప్పుకొందికే వచ్చేనన్నాడు. నే నిప్పుడు అక్కణ్ణించే వస్తున్నానంది. ఇతగాడు నాలిక కరుచుకున్నాడు. యిక్కణ్ణించివస్తూ భోజనానికి వెళ్ళి బజార్లోకి వెళ్ళేడు. దుకాణాల్లో సామాన్లు తమల్ని తామే అమ్ముకొంటున్నాయి. ధరల చీట్లు వాటికి అంటించ బడ్డాయి. బేరమాడి సిసలుధరలు కాబట్టి తిరిగివచ్చేసేడు- ఇదీ కథ. వాచీ టక్ టక్ కథని వాగింది. గది ఒకప్రశ్న వేసింది-మన యజమానికి పెళ్ళయిందా? వాచీ సమాధానం చెప్పింది- ఆ! నేను పెళ్ళి నాటి మామగారికానుకని. జోళ్ళు యీసారియిలాఅన్నాయి. మన యజమాని నడవడిబాగులేదు సుమా. వాచీ నన్ను సమర్ధించింది. ఏముంది. వయస్సు అలాంటిది. రొమాన్సూ, సువాయువులూ వీస్తున్నాయా. పెళ్ళంటే చిన్నప్పుడే అయిందిగానీ పెళ్ళానికీప్రేయసికీ తేడాలేదూ. పెళ్లాం పుట్టుమచ్చ, ప్రేయసి పచ్చబొట్టు. విధిలేక వుద్యోగం చేస్తున్నాడు గానీ వుద్యోగంచేసే వయస్సా యిది?

రాగాపోగా యజమాని సంసారం ఎలాగుంది? అని జోళ్లో గదో ప్రశ్నవేయగా వాచీ యిలా చెప్పింది: అదే

అడకుక్క. పెళ్ళాం మిఠాయికిళ్ళీ, మొగుడు లవంగం. ఎక్కడా పోలిక కుదరదు. అయినా సంసారం నోరుపండి ఆడపిల్ల సంతానం. ఒకనిట్టూర్చి - యింతసేపూ నన్ను వెనకేసుకొచ్చిన వాచీ ఇలా నన్ను తిట్టిపోసింది- ఆడపిల్ల అంటే యజమాని ఏమిటనుకొంటున్నాడో, ఈపిల్ల పెద్దదై పెళ్ళవనీ ఇవాళ మామగారిని కాల్చుకుతినడం అనుభవానికి వస్తుంది. ఆడపిల్లపుట్టిందగ్గరనుంచీ ఖర్చులేకదా! మొగవాడికైతే రెండు లాల్చీలు రెండులాగులు అయితే చాలు. ఆడపిల్లకు అబ్బో! ఎన్నిఖర్చులు? వేలకొద్దీ కట్నాలు, పెళ్ళయేక అత్తారింటికి వెళ్ళిపోయేకకూడా పండగలకి పిలవడాలు, బాలసారె ఖర్చులు, మనవల ముద్దు ముచ్చట్లు. ఆడపిల్లలవలన కూలిన యిళ్ళెన్ని లేవు.

జోళ్ళ వాచీని తమ్ముడూ, యజమానిని నిందిస్తున్నావని హెచ్చరించింది. గది వూరుకుంది. వాచీ మామగారికానుక. వాళ్ళపక్షం మాట్లాడుతుంది అని జోళ్ళ సందేహం. వాచీ అబద్ధమాడదు. కాలంలో జరిగేవాటినీ, వాటిని అనుసరించుకొని వచ్చే మార్పులనీ చెప్పడమే దానిపని. అయితే యివన్నీ అది పక్షపాతంకోసంగా చెప్తుంది. గదిలోకి ఎవరో వచ్చినట్లుయింది. అది ఎవరు వారంది. ఆ మనుష్యులు బెంగాల్లో ఆకలికి చచ్చున్నవాళ్ళు. బక్క పేగులతో ఏడ్చేరు. కీచురాళ్ళలాగ, దోమలసంగీతంలాగ వాళ్ళ ఏడుపు ధ్వనిస్తున్నాది. ఆ తరువాత తెలిసింది. రోజూ

యిలాగేనట. నేను తెచ్చిచదివే పేపర్లలోని వార్తల వెనకా తలి మనుష్యులంతా నాందిలోకి వచ్చి ఈ ముగ్గురితో మాట్లాడి పోతూవుంటారట. నా వస్తువులు అన్నివిధాలా మానవులకి తీసిపోవు. ఒక్క వుత్పత్తిశక్తితప్ప అన్నీ వాటికి వున్నాయి. అయినా అవి మానవాతీతాలు. వాటికి కాక నా రహస్యాలు ఎవరికి తెలుసు? ఎవరికి కావాలి?"